# నిద్రానుభవాలు

నిద్ర అలసిపోయిన శరీరానికి విశ్రాంతి నిచ్చేది నిద్ర. కోటికి పడగలెత్తిన శ్రీమంతుడైనా, కూటికి లేని నిరుపేదకైనా ఒకే విధమైన తృప్తిని ఇచ్చేది. నిద్ర జిహ్వాకో రుచి, పుర్రెకో బుద్ధి అన్నారు విజ్ఞులు. అలాగే మనిషికి ఒక రకమైన నిద్ర – కొంత మందికి పక్కమీద పడుకోగానే హాయిగా నిద్రపడుతుంది. ఇంకొందరికి ప్రశాంతమైన వాతావరణం, మెత్తని తెల్లటి పక్క వుంటే కానీ నిద్ర పట్టదు. ఇక నిద్రలో మనుషులు చేసే తమాషాలు కోకొల్లలు. అటూ ఇటూ పొర్లి తెల్లారేసరికి పక్కమీద రెండో చివరకి చేరిపోయే వాళ్ళు కొందరైతే, అసలు పక్కమీదే ఉండకుండా దొర్లి కిందపడిపోయేవారు మరికొందరు. కలవరించేవాళ్ళు, గురక పెట్టేవాళ్ళు, పోట్లాడేవాళ్ళు, అమాంతం మంచం మీద నుంచి లేచి నడిచేవాళ్ళు.... వోహ్! రకరకాలు.

నా మటుకు నాకు విచిత్రమైన జబ్బు. పది రోజులు ఒకటే నిద్ర. రాత్రీ పగలూ భేదం లేకుండా నిద్ర తెల్లగా తెల్లవారి బారెడు పొద్దెక్కేదాకా పడుకుని లేచినా, మళ్ళీ పదింటికల్లా నిద్ర. సాయంత్రం అయిదింటిదాకా గాఢ నిద్ర పోయినా రాత్రి ఏడు అయ్యేసరికల్లా కళ్ళు మూసుకుపోతాయి. సరే పోనీ – కుంభకర్ణుడికి, మా పూర్వీకులకు సంబంధం ఉండి ఉంటుంది... అనుకుని సరిపెట్టుకుందాం అనుకునేందుకు వీల్లేదు. పది రోజులు చచ్చినా నిద్ర పట్టదు. పగలంతా పనిచేస్తే రాత్రి హాయిగా పడుకో వచ్చు అని పగలంతా క్షణం విశ్రాంతి లేకుండా ఆ పనీ ఈ పనీ చేసి, చన్నీళ్ళ స్నానంచేసి పడుకున్నా నిద్ర దరిదాపులకు రాదు. ఆ మధ్య ఒకసారి వరసగా వారం రోజులు నిద్ర పట్టక తల తిరిగి పోవటం మొదలైతే డాక్టరు దగ్గరకి వెళ్ళాను. అంతా విని నిద్ర మాత్రలు ఇచ్చారు ఆయన. “ఇవి వేసుకోండి. హాయిగా నిద్ర పోతారు” అన్నాడు. “అయితే ఇవి వేసుకునే ముందు భోజనం చెయ్యాలి సుమా” అని కూడా హెచ్చరించాడు.

గబగబా ఇంటికి వచ్చి పనంతా ముగించి భోజనం చేసి మాత్రలు మింగి ఇంట్లో వాళ్ళందర్నీ పిలిచాను. "ఇదిగో చూడండర్రా. నేను పడుకోబోతున్నాను. అల్లరి చేశారంటే తంతాను" అని పిల్లలనీ, "నేను నిద్ర పోతాను. స్లీపింగ్‌పిల్స్ వేసుకున్నాను. నేను లేవటం ఆలస్యం అయినా గాభరా పడద్దు. నా అంతట నేను లేచేదాకా నన్ను లేపద్దు. ఎవరైనా వచ్చినా సరే నన్ను లేపద్దు నేను బాగా నిద్రపోవాలి" అని పెద్దలనీ హెచ్చరించాను. "సరే" అని ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు అందరూ. 'అమ్మయ్య' అనుకుని నిద్ర కుపక్రమించాను.

కానీ ఏమి లాభం లేకపోయింది. కాసేపటికే ఇంట్లో పిల్లా పెద్దా అందరూ హాయిగా నిద్ర పోయారు. నేను మాత్రం కొరివి దయ్యంలా రాత్రంతా కూర్చునే ఉన్నాను. తెల్లారాక డాక్టరుకి ఫోన్ చేసి చెడామడా దులిపాను. "నేనిప్పుడు అర్జెంటు పని మీద వూరికి వెళుతున్నాను. రెండు రోజుల్లో తిరిగి వస్తాను. అప్పుడు మీకు అన్ని టెస్ట్‌లూ చేయిస్తాను" అని బతిమాలుకున్నాడు మా ఫామిలీ డాక్టరు. అన్న ప్రకారం రెండు రోజుల తరువాత ఆదివారం మధ్యాహ్నం పదకొండింటికి వచ్చాడు. అయితే అప్పటికే నా నిద్ర పక్షం మొదలై పోయింది. అతి కష్టం మీద లేచి తూలుతూనే ఒక నమస్కారం చేసి ఆవలిస్తూ ఆయనని ఆహ్వానించి సోఫాలో కూర్చుని నిద్ర పోవటం ప్రారంభించాను. పది నిమిషాలు కూర్చుని లేచి వెళ్ళిపోయాడు. ఆ తరువాత నాలుగైదు రోజులు వరసగా ఫోన్ చేసి నాతో మాట్లాడడానికి ప్రయత్నం చేశాడు. ఆయన ఎప్పుడు అడిగినా ఒకే సమాధానం ఇవతలి నించి – "నిద్ర పోతున్నారు" అని.

వారం తరువాత ఆయనే వచ్చారు స్వయంగా. అదృష్టవశాత్తూ నేను మేలుకునే ఉన్నాను. "బాగా నిద్ర పోతున్నారా?" అంటూ నవ్వుతూ ఆయన పలకరించేసరికి సిగ్గు వేసింది. నా అవస్థ ఆయనతో చెప్పుకున్నాను. అంతా విని మరోసారి నవ్వారు. ఆయన కాఫీ తాగుతూ వాళ్ళావిడ గురించి చెప్పుకొచ్చారు. ఆవిడకి ప్రతి రోజు బోలెడు కలలు వస్తాయట. "ఇప్పుడు అలవాటు అయిపోయింది కానీ మొదట్లో నానా అవస్థపడిపోయే వాడిని. హఠాత్తుగా లేచి వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది ఒక రాత్రి. కంగారుగా కారణం అడిగాను. ఏడుస్తూనే అమెరికా ప్రెసిడెంటు కార్టర్‌ని చంపేశాను. పోలీసులు పట్టుకున్నారు. ఇక వదలరు అని బావురుమంది. నాకు నవ్వువచ్చింది. 'ఛ, పిచ్చి మొహమా! ఈ మూల ఇండియాలో ఆంధ్రదేశంలో ఈ వూర్లో ఉన్న నువ్వు ఆ మూల అమెరికాలోని వైట్‌హౌస్‌లో ఉన్న కార్టర్‌ని ఎలా

కాల్చిచంపుతావు? అది కలే. పడుకో అని బుజ్జగించి పడుకోబెట్టాను. మరునాడు మళ్ళీ బావురుమని ఏడుస్తూ లేచింది. ఏమిటే? ఎందుకేడుస్తున్నావ్? నేనేమైన నీ మనసును కష్టపెట్టానా? అని అడిగాను మత్తుగా. 'అయ్యో లేదండీ నటుడు దిలీప్‌కుమార్ లేడూ?, అడిగింది. 'ఉన్నాడు' అన్నాను. 'అతగాడు కత్తితో నన్ను పొడిచాడు. నేను చచ్చిపోయాను' అంటూ ఏడ్చింది. నాకు చిరాకువేసింది. ఎందుకు పొడిచాడు? నువు అతన్ని ఏం చేశావ్ అని అడిగాను. నేనా? ఏమీ చెయ్యలేదండీ. అతనే కత్తి పెట్టి కడుపులో పొడిచాడు. కెవ్వుమంటూ అరిచి చచ్చిపోయాను' అంది వెక్కిళ్ళు పెడుతూ, ఇక నాకు చిరాకు ఆగలేదు. 'సరే చచ్చిపోయావు - ఒప్పుకొంటాను. మరి ఇప్పుడు నాతో మాట్లాడుతున్నది ఎవరు? నీ దయ్యమా?' అని అడిగాను. అప్పటికి పూర్తిగా మెలకువ వచ్చింది ఆవిడకి. 'పోదురు మీ దంతా మరీ తమషా' అంటూ పడుకుంది. ఇప్పటికీ అంతే ఉన్నట్లుండి లేచి డ్రామా మొదలుపెడుతుంది. ఆ మధ్య నా ఫ్రెండ్‌తో ఈ మాటే అంటే 'అలా పీడకలలు రావడం చాలా మంచిది. మీ ఆవిడకి ధనయోగం ఉంది' అన్నాడు. ఏమో మరి పెళ్ళైయి ఏడేళ్ళు అయినా ఇప్పటి దాకా పీడకలలు తప్ప ధనయోగం కనిపించలేదు. ఇక ముందు ఏం జరుగుతుందో... అంటూ తప కష్టాన్ని చెప్పుకుని లేచాడు డాక్టరు. "ఏమో లేండి. ధనయోగం పట్టడానికి ఎంతసేపూ. ఏ యు.పి లాటరీనో తగిలితే చాలు" అంటూ ఆయనతో వెళ్ళాను. వాకిలిదాకా సాగనంపి వస్తుంటే ఆయన భార్య గుర్తుకు వచ్చి నవ్వు వచ్చింది. నేనే అనుకుంటే నా కన్నా సీరియస్ కేసు అనిపించింది. అయితే ఆ అభిప్రాయం ఆ తరువాత కొద్ది రోజులకే మారిపోయింది.

ఆ వేళ పనిమీద పొరుగూరు వెళ్ళాను. పని అయిపోయింది. వెళ్ళి ఆ హోటల్ రూంలో పడుకునేకన్నా సినిమాకి వెళితే కాస్త కాలక్షేపం అవుతుంది అనుకుని ఫస్ట్ షో సినిమాకి వెళ్ళాను. సినిమా అయిపోయాక భోజనం చేసి హోటల్ వైపు నడుస్తూ ఉంటే ఎవరో పిలిచినట్టై తిరిగి చూశాను. రామారావు పాత మిత్రుడు. నేను తిరిగి చూడగానే అమాంతం కౌగిలించుకున్నాడు. అనుకోకుండా హఠాత్తుగా ప్రాణస్నేహితులను కలుసుకోవాలంటే కలిగే అనుభూతి వర్ణించలేనిది. ఇద్దరం ఆత్రంగా మాట్లాడుకున్నాం. వాడు ఆ వూళ్ళోనే ఉన్నాడట. "మరోసారి వస్తానురా ఇప్పుడెందుకు చాలా పొద్దుపోయింది" అని చెబుతున్నా వినకుండా నా వెంట హోటల్‌కి వచ్చి రూమ్ ఖాళీ చేయించి "ఇకపద" అన్నాడు. వాడి ప్రేమకు ముగ్ధుడినై పోయాను. ఇద్దరం వాడి ఇంటికి వెళ్ళాం. చక్కగా పొందికగా వుంది ఇల్లు. సెపరేటుగా ఉంది.

అదే అన్నాను వాడితో. "అవున్రా అద్దె ఎక్కువ అయినా కావాలని ఇలా సెపరేట్‌గా ఉండే ఇల్లు తీసుకున్నాను." అంటూ లోపలకి వెళ్ళాడు. వాడి వెనకాలే నేనూ వెళ్ళాను. ఇళ్లంతా నిశ్శబ్దంగా ఉంది. సీలింగ్‌ఫాన్ల మోత తప్ప మరే శబ్దమూ లేదు. అంతా పడుకుని ఉంటారు. నా కెందుకో మొహమాటంగా అనిపించింది. వాడు కాలింగ్ బెల్ మోగించలేదు. కనీసం తలుపైనా తట్టలేదు. అసలు మేయిన్ డోర్ వైపే వెళ్ళలేదు. "జస్ట్ ఎ మినిట్" అని నాతో చెప్పి కాంపౌండ్ వాల్ దగ్గరికి వెళ్ళాడు. అక్కడ సన్నజాజి తీగ దట్టంగా అల్లుకుని పైకి పాకి ఉంది. ఒక్క క్షణం వెతికి ఆ చెట్టు పక్క నించి ఒక కర్ర బయటికితీశాడు. అది బూజు దులుపుకునే కర్ర. నా కంతా అయోమయంగా అనిపించింది. ఏమిటిది? అర్ధరాత్రి ఇంటికి వచ్చిన వీడు తలుపు తట్టి ఇంట్లోకి వెళ్ళకుండా బూజు కర్ర ఎందుకు తీసుకుంటున్నాడు? ఏమిటి మిస్టరీ? నా ఆలోచనలు తెగకుండానే ఆ కర్ర చేత్తో పుచ్చుకుని ఇంటికి కుడి వైపు ఖాళీ స్థలంలో చకచక నడుస్తూ ముందుకు వెళ్ళాడు.

నా కెందుకో భయం వేసింది. అసలిది వీడి ఇల్లేనా? నన్నేందులోనైనా ఇరికించడు కదా! అని సందేహం వచ్చింది. ఏమయితే అయిందని నేనూ వాడి వెనకే వెళ్ళారు. వాడు వెళ్ళి వెళ్ళి ఒక పెద్ద కిటికీ దగ్గర ఆగాడు. అది బెడ్‌రూమ్ అని చూడగానే తెలిసిపోయింది. లోపల నీలం రంగు బెడ్‌లైట్ వెలుగుతూంది. రామారావు ఒక్క క్షణం పరిశీలగా గదిలోకి చూసి కర్ర పట్టుకుని కుంచె ఉన్నవైపు కిటికీలోనించి లోపలికి పెట్టాడు. నా అనుమానం మరింత బలపడింది. పారిపోవటానికి కూడా శక్తి లేనట్లూ స్తంభించి పోయాను. లోపల మంచం, మంచం మీద పడుకుని వున్న యువతి నీలంకాంతిలో మసక మసకగా కనిపిస్తున్నాయి. మా వాడు ఈ బూజుకర్ర తాలూకు కుంచెని ఆ యువతి మొహం మీద అటూ ఇటూ రెండు మూడు సార్లు అడించాడు. రక్తం మరిగి పోయింది. ఇంత చదువూ చదివి ఏమిటి వీడు చేస్తున్న పని? చాచి లెంపకాయ కొట్టాలనిపించింది. మరో క్షణం ఆగితే కొట్టేవాడినే. అంతలోనే "హచ్" మని శబ్దం వినిపించింది. ఉలికిపడి చూశాను. ఆ యువతే లేచి కూర్చుని హచ్, హచ్ మంటూ మరో రెండు సార్లు తుమ్మింది. మా వాడు రిలీఫ్‌గా నిట్టూర్చి కర్ర బయటికి లాగేశాడు. "వైదేహీ... వైదేహీ" అని పిలిచాడు.! "ఆఁ ఎవరూ" అంది ఆవిడ కంగారుగా. "నేనే, వైదేహీ తలుపు తిస్తావా?" అన్నాడు రామారావు. "మీరా? వచ్చేశారా? వస్తున్నా?" అంటూ లేచింది ఆవిడ. "రారా" అంటూ నా చెయ్యి పట్టుకుని ముందుకి దారి తీశాడు రామారావు. ఇద్దరం మళ్ళీ

ముందు వైపుకి వచ్చాం. నా చెయ్యి వదిలి జాజి చెట్టు దగ్గరికి వెళ్ళి ఆ బూజు దులిపే కర్ర ఎక్కడినుంచి తీశాడో అక్కడ పెట్టేసి వచ్చాడు. బయట లైటు వెలిగింది. తలుపు తెరుచుకుని ఇవతలకి వచ్చింది ఆవిడ. "వైదేహీ! నీకు చెబుతూ ఉంటానే – మా స్నేహితుడని, వీడే" అంటూ నన్ను పరిచయం చేసి, "ఒరే, నా భార్య వైదేహి!" అంటూ నాకు చెప్పాడు. "నమస్కారం" రండి. మీ గురించి ఆయన ఎప్పుడు చెబుతూ వుంటారు" అంటూ చల్లగా నవ్వుతూ చేతులు జోడించింది వైదేహి. అప్రయత్నంగా నేనూ చేతులు జోడించాను. నన్ను లోపలికి తీసుకువెళ్ళాడు. చూడముచ్చటగా ఉంది ఇల్లు. "ఇదుగో నా భావి భారత పౌరులు" అంటూ నిద్ర పోతున్న ఇద్దరు పిల్లలని చూపించాడు. ముత్యాల్లా ఉన్నారు. "ఒరే! సత్యారావు ఎక్కడ ఉన్నాడురా? మూర్తి అమెరికా వెళ్ళిపోయాడుటగా" అంటూ కబుర్లు మొదలు పెట్టాడు. "చాల్లెండి, మీదంతా మరీ విచిత్రం. కబుర్లకేం! తరవాత చెప్పుకో వచ్చు. ముందు ఆయనని కాస్త వూపిరి పీల్చుకోనివ్వండి" అంటూ భర్తని మందలించింది వైదేహి. దానితో తెలివి తెచ్చుకుని "లేరా – స్నానం చెయ్యి. చన్నీళ్లు చేస్తావా, వేణ్ణీళ్ళు పెట్టించనా!" అంటూ నాకు మర్యాదలు చెయ్యటం మొదలుపెట్టాడు రామారావు. కాఫీ తాగి స్నానం చేశాక నేను భోజనం చేశాను. నా కేం వద్దు అంటున్నా!! వినిపించుకోకుండా బలవంత పెట్టి మళ్ళీ మజ్జిగ అన్నం తింటే కానీ వదిలి పెట్టలేదు. భోజనాలు అయ్యాక నాకు ముందు గదిలో సోఫా –కమ్ బెడ్‌మీద పక్క పరిచి వెళ్ళిపోయింది వైదేహి.

రామారావు మాత్రం నా పక్కనే ఈజీచైర్‌లో కూర్చున్నాడు. "ఒరేయ్" అంటూ మొదలు పెట్టిన వాడిని మధ్యలోనే ఆపేశాను. "రామం అంతా బాగానే ఉంది కానీ, ఆ బూజు కర్ర ఏమిటీ; ఆ వ్యవహారం ఏమిటి? ఏమిట్రా అదంతా?" అని నన్ను పీడిస్తున్న సందేహం బయట పెట్టాను. చిన్నగా నవ్వాడు వాడు. "అదా? మా ఆవిడకి నిద్ర పడితే ఒక పట్టాన మెలకువ రాదురా!" అంటూ మొదలు పెట్టాడు. పెళ్లి అయిన మరునాడు భార్యని తీసుకుని సెకండ్ షో సినిమాకి వెళ్ళాడట తను. సినిమా చూడకుండా తనివితీరా కబుర్లు చెప్పాడుట. ఆవిడ కూడా మధ్య మధ్యలో మాటలు కలిపిందిట. మరో పది నిమిషాలలో సినిమా అయిపోతుందనగా, వీడి భుజం మీద తల వాల్చుకుందిట ఆవిడ. ఇంకే వుంది. పరవశించి పోయాడు వీడు. సినిమా అయిపోయింది. "స్వీట్ హార్ట్, ఇక లే ఇంటికి వెళదాం" అన్నాడుట మెల్లగా. ఆవిడ కదల్లేదు. అప్పుడు చూశాడుట ఆవిడ నిద్ర పోతూందిట. "లే ఇదేంటి? చిన్న పిల్లలా సినిమా హాల్లో నిద్రేమిటి?" అంటూ లేపాడుట. కదలిక లేదుట. భుజం తట్టాడుట

గిల్లాడుట, రక్కాడుట, ఎంత ప్రయత్నించినా కదలకుండా నిశ్చింతగా నిద్ర పోతూంది ఆవిడ. ఈ లోపల ఆ హాలు ప్రొప్రైటరూ, మేనేజరూ, ఆపరేటరూ, గేటుకీపరూ స్వీపరూ కూడా అక్కడికి వచ్చారుట. వీడి అవస్థ చూశారట. పోనీ ఎత్తుకుని తీసుకు వెళ్ళండి అని సలహా ఇచ్చారుట. కానీ అలా పెళ్ళాన్ని చంటి పిల్లలా భుజాన వేసుకునేందుకు వీడు నవలా నాయకుడా? లేకపోతే వెయిట్ లిఫ్టింగ్ చాంపియనా? దిగులుగా మొహం పెట్టాడుట. సరే పోన్లెండి. ఈ పూటకి మీరు ఇక్కడే నిద్ర పోండి అని చెప్పి చక్కా పోయాడుట ఆ ప్రొప్రైటరు. ఆ రాత్రంతా తన ఖర్మానికి తిట్టుకుంటూ ఆ హాల్లోనే గడిపాడుట. తెల్లారగానే లేచిందిట వాళ్ళావిడ. ఏమీ ఎరగనట్లే ఎదురుగా ఉన్న భర్తని చూసి నవ్వుతూ "హాయ్ గుడ్ మార్నింగ్" అందిట. ఆ క్షణాన వీడికెంత కోపం వచ్చిందంటే విడాకులు ఇచ్చేద్దామనుకున్నాడట. కానీ అయిన వాళ్ళంతా నచ్చ చెప్పారుట. కట్టుకున్న భార్యని పారాణి అయినా ఆరకముందే కేవలం సినిమా హాల్లో నిద్ర పోయిన నేరానికి విడాకులు ఇస్తానంటే చట్టం చచ్చినా ఒప్పుకోదురా అని చెప్పారుట.

ఆలోచిస్తే వీడికీ అంతే అనిపించిందట. ఈవిడని వదిలేసి మరో ఆవిడని కట్టుకుంటే ఆవిడ ఈవిడికి తాత లాటిది అయితే? తెల్లారినా నిద్ర లేవకపోతే? అప్పుడేం చేస్తాం? అనుకుని జీవితంలో రాజీ పడి పోయాడుట. "కానీ అనుకున్నంత తేలిక కాదురా. నిద్ర పోతే ఒక పట్టాన లేవదు. నేను వచ్చి తలుపు తట్టినా, అరిచినా మొత్తుకున్నా నిద్ర మెలకువ రాదు. నా కేకలకి హడావిడికి అటు నాలుగిళ్ళ వాళ్ళు, ఇటు నాలుగిళ్ల వాళ్ళు లేవటం, చోద్యం చూడటం, సలహాలు చెప్పటం, నవ్వుకోవటం ఇదంతా పెద్ద తలనొప్పిగా తయారయింది. అందుకని ఆలోచించి ఈ మార్గం ఎంచుకున్నాను. వూళ్ళో ఉంటే సాయంత్రం చీకటి పడ్డాక ఎక్కడికి వెళ్ళినా బయట తాళం వేసుకుని వెళ్ళి పోతాను. కాంపులకి వెళ్ళినప్పుడు అలా తాళం వేసి వెళ్ళలేను గనక ఈ బూజు కర్ర పద్ధతి ప్రవేశ పెట్టాను. ఇప్పుడే సమస్యా లేదు" అంటూ ఆవలించాడు రామారావు. తెల్లవారాక వేడివేడిగా రవ్వదోశలు వేసి టిఫిన్ పెట్టింది వైదేహి. 'అన్నయ్యగారూ' అంటూ ఆప్యాయంగా పిలుస్తూ ఉంటే నా సొంత చెల్లెలి ఇంట్లో ఉన్నట్లు అనిపించింది నాకు. వాళ్ళు ఉండమని బలవంతం చేసినా పని ఉండటం వలన పది గంటల కల్లా బయలు దేరాను. వాకిలి దాకా వచ్చి సాగనంపింది వైదేహి. రామారావు బస్టాండుకి వచ్చాడు. "అనుకోకుండా కలిశాం, నిన్నూ, నీ సంసారాన్ని చూసి నా కెంతో సంతోషంగా ఉందిరా నీ భార్య చాలా మంచిది. నీ

పిల్లలు ముత్యాల్లా ఉన్నారు" అన్నాను. సరదాగా నవ్వాడు వాడు. "ఆ ఒక్క లోపం తప్పితే వైదేహి చాలా మంచిది" అన్నాడు.

అంతలోనే బస్ వచ్చింది. ఎక్కి కూర్చున్నారు. కిటికీ దగ్గర నిలబడ్డాడు వాడు. "ఏమిటో మాట్లాడుకున్నట్లే లేదు. ఈ సారి నాలుగు రోజులు ఉండేటట్లు రారా, నీ భార్యనీ, పిల్లల్ని తీసుకురా, సరదాగా కాలక్షేపం చేద్దాం" అన్నాడు. నా మనసు ఆర్ద్రమైపోయింది. "అలాగే లేరా" అన్నాను. బస్‌స్టార్ట్ అయింది. "ఒరేయ్ పగటి పూట వచ్చినా ఏ బాధా లేదు, లేకపోతే మాత్రం తలుపు తట్టే ప్రయత్నం చెయ్యకు, ఏం చెయ్యాలో తెలుసుగా?" అంటూ చెయ్యి వూపాడు నాకు నవ్వు ముంచుకు వచ్చింది.

వినే వాళ్ళకు నవ్వుగానే ఉంటుంది. పడే వాళ్ళకు తెలుస్తుంది ఆ తిప్పలు. ఊరికి రాగానే మా డాక్టరుకి చెప్పాను రామారావు వైదేహిల తమాషా. ఆయన నవ్వాడు. ఆవిడతో పోల్చుకుంటె మా ఆవిడ నయమే కదా అన్నాడు. "అవును అన్నాను. తనకు మించిన కేసు ఏదైనా తారసపడితే రామారావు కూడా అలాగే తృప్తి పడతాడు. పెళ్ళి అయిన వాళ్ళు సరే ఎలాగో ఎడ్జస్టు అయిపోతారు తమ తమ జీవిత భాగస్వాములతో. కనీసం పెళ్ళి కాని వాళ్ళయినా పెళ్ళి చూపుల్లో వంటొచ్చా? పాటొచ్చా? మొదలైన ప్రశ్నలతో పాటు మీకు సుఖంగా నిద్ర పోయే అలవాటు ఉందా' అని అడిగి తెలుసుకుంటే సరి.

*ఆంధ్రప్రభ, 28 మార్చి 1984*